క్లుప్తంగా

26న పుష్పగిరిలో పంచ నదీ హారతి

వల్లూరు : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 26వ తేదీన సాయంత్రం 6 గంటలకు పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరిలో ఆశా రేఖ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంచ నదీ హారతి, కార్తీక దీపోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్‌పర్సన్ నెమలిదిన్నె నాగవేణి ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తరలి రావాలని ఆమె కోరారు. కార్యక్రమాలకు హాజరయ్యే భక్తుల సౌకర్యార్థం 26 తేదీ సాయంత్రం 4 గంటలకు కడప పట్టణంలోని ఎస్పీ బంగళా ఎదురుగా వున్న ఏపీ టూరిజం హరిత హోటల్ వద్ద నుంచి ఉచితంగా బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బస్సులో పుష్పగిరికి రావాలని ఆసక్తి వున్న వారు ఈనెల 24వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆమె కోరారు. జ్యోతులు వెలిగించే వారు దీపాలు తమ వెంట తెచ్చుకోవాలని తెలిపారు.

నేడు ఉచిత యునాని వైద్య శిబిరం

కమలాపురం : స్థానిక కుమ్మర వీధిలోని మదరసా ఏ షాహీమీరియ తాలిమున్ ఖుర్‌ఆన్ వద్ద శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచిత యునాని వైద్య శిబిరం జరుగుతుందని ప్రభుత్వ ఖాజీ హాఫిజ్ సయ్యద్ జాహీద్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒంటిమిట్ట ప్రభుత్వ యునాని వైద్యశాల వారి ఆధ్వర్యంలో జరిగే ఈ వైద్య శిబిరంలో అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైభవంగా సత్యసాయి రథోత్సవం



సత్యసాయి గ్రామోత్సవం

పులివెందుల టౌన్: స్థానిక పాత మార్కెట్ సాయిబాబా ఆలయంలో గురువారం సత్యసాయి 98వ జయంతి ఉత్సవాల సందర్భంగా సత్యసాయి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. సత్యసాయి, షిర్డిసాయి విగ్రహాలను ప్రత్యేకంగా తయారు చేయించిన రథంలో ఉంచి మంగళ వాయిద్యాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. చెక్క భజనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పట్టణంలోని మెయిన్‌బజార్, పార్నపల్లె రోడ్డు, పూలంగళ్ల సర్కిల్, ముత్యాలవారి వీధి, గాడిచర్లవీధి, అమ్మవారిశాల మీదుగా గ్రామోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయిసేవా మహిళా మండలి, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ఓపెన్ ఫోరం

వల్లూరు : మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలలో 2022 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2023 మార్చి 31 వరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించి శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్నట్లు ఈవోపీఆర్‌డీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు ఈ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

వేంపల్లె ఎంఈఓగా జాఫర్ సాదిక్



ఎంఈఓ-1 జాఫర్ సాధిక్‌ను సన్మానిస్తున్న ఎస్టీయూ రాష్ట్ర నాయకులు

వేంపల్లె : వీరపునాయునిపల్లె ఎంఈఓగా పనిచేస్తున్న జాఫర్ సాదిక్ వేంపల్లె మండల ఎంఈఓ-1గా గురువారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంఈఓ బండి వీరారెడ్డి అనారోగ్య కారణాలతో సెలవుపై వెళ్లారు. ఎస్టీయూ ఏపీ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర నేతలు ఆయనను సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 స్టాలిన్ ఐజాక్, సంగమేశ్వరరెడ్డి, ధర్మారెడ్డి, లక్ష్మీనరసింహ, ప్రతాప్‌రెడ్డి, రాజశేఖరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పత్ర కులస్తుల సంక్షేమం కోసం పోరాడుతాం

పులివెందుల టౌన్ : రాష్ట్రంలోని నిరుపేద పత్ర సోదరుల సంక్షేమం కోసం రాజీలేని పోరు కొనసాగిస్తానని పత్ర సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సారె విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక కదిరి రోడ్డులో ఉన్న విజయ్ గార్డెన్‌లో ఇటీవల పత్ర సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన విజయ్‌కుమార్‌కు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు పత్ర సంఘ నాయకులు, అభిమానులు హాజరయ్యారు. వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి జగనన్నను ఆశీర్వదించండి

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



వీఎన్‌పల్లెలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



ఎర్రగుంట్లలో వలంటీర్లకు కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూసి జగనన్నను ఆశీర్వదించండి అని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ప్రజలను కోరారు. గురువారం వీరపునాయునిపల్లె సచివాలయం వద్ద నిర్వహించిన ఏపీకి జగనన్నే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎటువంటి రాజకీయ అనుభవం లేనటువంటి జగనన్న అందించిన పాలనకు అలాగే 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబునాయుడు పాలనకు గల వ్యత్యాసాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. చంద్రబాబునాయుడు అబద్ధపు మాటలు చెప్పి ప్రజలను మోసం చేశాడన్నారు. వలంటీర్లు, గృహ సారథులు ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు గల తేడాను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం సంక్షేమ పథకాలకు సంబంధించిన బోర్డును ఆయన ఆవిష్కరించారు. రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, మండల అభివృద్ధి అధికారి సాయి నాయక్, ఎంపీటీసీ రాఘవ యాదవ్, సర్పంచ్ మణికంట, మాజీ సర్పంచ్ రవీంద్రనాథ్‌రెడ్డి, స్థానికాయకులు తిరుమల్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి తెలిపారు. మండలంలోని చదిపిరాళ్ల గ్రామంలో గురువారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ముందు ముందు రాష్ట్ర భవిష్యత్తు ఉజ్వలంగా మారనుందన్నారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డును, వైఎస్ఆర్‌సీపీ జండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరత్నమ్మ, ఎంపీటీసీ ప్రభావతమ్మ, మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సుమిత్ర రాజశేఖర్‌రెడ్డి, రాజుపాలెం సుబ్బారెడ్డి, ఎస్సీ పుల్లారెడ్డి, మునీంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, చిన్ని, అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల టౌన్ : రాష్ట్ర ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేయడంవల్ల రాష్ట్రాభివృద్ధి జరిగిందని.. అందుకే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నదే ప్రజల అకాంక్ష అని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక సియోన్‌పురం సచివాలయ పరిధిలో నిర్వహించిన «ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే» కార్యక్రమంలో ఆయన పాల్గొని ముందుగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ప్రజల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల మన్ననలు పొందారని.. మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలని ప్రజలు కోరుతున్నారన్నారు. అనంతరం సంక్షేమ పథకాల హోర్డింగ్‌ను ఆయన ఆవిష్కరించారు. ప్రారంభించి జెండాను ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కడియాల లక్ష్మీనారాయణ, జేసీఎస్ ఇన్‌చార్జిలు పార్నపల్లె కిశోర్, చంద్రమౌళి, కౌన్సిలర్లుఖాదర్ బాషా, కోడి రమణ, అంకాలమ్మ ఆలయ చైర్మన్ బ్యాటరీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్దయ్య, డేనియల్‌బాబు, రసూల్, శ్రీరాములు, సంపత్, నాగరాజు, మహబూబ్ బాషా, ఫక్రుద్దీన్, రామ్మోహన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

వేములలో..

వేముల : ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ వారికి ఏమేరకు లబ్ధి చేకూరిందో ప్రజలకు వివరించాలని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవి, జెడ్పీటీసీ కె.వెంకటబయపురెడ్డిలు తెలిపారు. గురువారం మండలంలోని భూమయ్యగారిపల్లె సచివాలయంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల కాలంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందించి లబ్ధి చేకూర్చారన్నారు. అనంతరం వలంటీర్లకు సర్వే కిట్లను పంపిణీ చేసి మా నమ్మకం నువ్వే జగన్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, ఎంపీటీసీ మల్‌రెడ్డి, సర్పంచ్ కృష్ణయ్య, సొసైటీ మాజీ అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీరామిరెడ్డి, మాజీ సర్పంచ్ రాఘవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సచివాలయ-వలంటీర్ వ్యవస్థతో పేదల ఇంట సంక్షేమ పథకాలు వెల్లివిరుస్తున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని మహేశ్వరనగర్ కాలనీ 3వ సచివాలయ పరిధిలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వంలో అవ్వా, తాతలు పింఛన్ కోసం కాళ్లు అరిగేల ప్రదక్షిణలు చేసేవారన్నారు. జగన్ సీఎం అయ్యాక అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్ మంజూరు చేస్తున్నారన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్ సునీతతో కలసి వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరణ చేసి వలంటీర్లకు కిట్లను అందజేశారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు డి. సూర్యనారాయణరెడ్డి, వార్డు నాయకుడు చంద్రఓబుళరెడ్డి, మున్సిపల్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని.. ఆయన మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, ఏపీఐఐసీ డైరెక్టర్ చంద్ర ఓబుళరెడ్డి, ఎంపీపీ లక్ష్మీగాయత్రిలు తెలిపారు. గురువారం కత్తులూరు గ్రామ సచివాలయంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. కత్తూలూరు సచివాలయ పరిధిలో రూ.19.59 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు వేల హామీలిచ్చి పాలన గాలికి వదిలేశారన్నారు. జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే ప్రభుత్వ పథకాలు వచ్చేవన్నారు. ప్రజా సేవే ప్రభుత్వ బాధ్యత అని నమ్మిన జగనన్నను మరోసారి సీఎం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఏఓ సోమశేఖరెరెడ్డి, ఏపీఎస్ఆర్టీ కో ఆర్డినేటర్ ఎం.శ్రీకాంత్‌రెడ్డి, కత్తులూరు ఎంపీటీసీ కళ్యాణి, సర్పంచ్ పావని, సచివాలయ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, ఎస్సీ సెల్ కన్వీనర్ ఎస్.జయరాములు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

తొండూరులో..

తొండూరు : రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని.. రాష్ట్ర ప్రజలందరూ కోరుకుంటున్నారని శాప్ రాష్ట్ర డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రవీంద్రారెడ్డి తెలిపారు. గురువారం తొండూరు సచివాలయంలో నిర్వహించిన ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కుల, మత, పార్టీలకతీతంగా అర్హులందరికి సంక్షేమ పథకాలు అందించడంతోపాటు నాడు-నేడు ద్వారా పాఠశాలలను దేవాలయాలుగా మార్చారన్నారు. సర్పంచ్ రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకుడు రామమునిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు శశికాంత్‌రెడ్డి, రాష్ట్ర డైరెక్టర్లు సురేష్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, మండల రైతు సంఘం నాయకులు వెంకట్రామిరెడ్డి, మండల గృహ సారథుల కన్వీనర్ రజినికాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ తొండూరు నాయకులు రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, మునెయ్య, నాగమునెయ్య, నాగయ్య, శ్రీను, రమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : బిదినంచర్ల గ్రామ సచివాలయ పరిధిలో గురువారం జేసీఎస్ మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బ్రహ్మానందరెడ్డి, కేశవరెడ్డిల ఆధ్వర్యంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలో లబ్ధిదారులు పొందిన నిధుల వివరాలు తెలిపే పట్టిక బోర్డును వారు ఆవిష్కరించి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఝాన్సీరాణి, ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రాజేశ్వరి, సర్పంచ్ వెంకటసుబ్బయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : పట్టణంలోని కోటవీధిలో ఉన్న 15, 16వ వార్డు పరిధి సచివాలయంలో జగనన్నే ముఖ్యమంత్రి ఎందుకు కావాలంటే అనే కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. పేదలకోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలన్ని పార్టీలతో సంబంధంలేకుండా అందుతున్నాయన్నారు. ప్రజలు రాబోయే ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలన్నారు. వైస్ చైర్మన్ సింగరయ్య, బడిగించల చంద్రమౌళి, వేణు, బ్రహ్మానందరెడ్డి, కిరన్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చక్రాయపేటలో..

చక్రాయపేట : మండలంలోని మహాదేవపల్లె సచివాలయం వద్ద నిర్వహించిన ఏపీకి జగనన్నే ఎందుకు కావాలి కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వాలలో కంటే జగనన్న ప్రభుత్వంలో చక్రాయపేట మండలం కనీవిని ఎరుగని రీతిలో అభివృద్ధి చేందిందన్నారు. అందుకే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. ఎంపీపీ మాధవీ బాలకృష్ణ, జడ్పీటీసీ శివప్రసాదరెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రామచంద్ర, సింగిల్ విండో డైరెక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఉత్తమారెడ్డి, రామకృష్ణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రామాంజులరెడ్డి పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామని జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డిలు పిలుపునిచ్చారు. మండలంలోని గొందిపల్లె గ్రామ సచివాలయంలో గురువారం ఏపీకి సీఎం జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. సీఎం జగన్ పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి రాష్ట్రాన్ని ఆదర్శంగా మార్చారన్నారు. అనంతరం సంక్షేమ పథకాల లబ్ధిదారుల బోర్డు, మానమ్మకం నువ్వే జగనన్న జెండాను ఆవిష్కరించారు. వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, సర్పంచ్ భాస్కర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు రామాంజనేయరెడ్డి, ధనుంజయరెడ్డి, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి మళ్లీ కావాలని లింగాల ఎంపీపీ అలవలపాటి రమాదేవి తెలిపారు. గురువారం ఇప్పట్ల గ్రామ సచివాలయ ఆవరణలో ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. అనంతరం ఎంపీడీఓ సురేంద్రనాథ్ మాట్లాడుతూ ఇప్పట్ల, హిరోజ్‌పురం, అంబకపల్లె గ్రామాల ప్రజలకు ప్రత్యక్షంగా రూ.21,19 కోట్లు, పరోక్షంగా రూ.7.04 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. కిట్లను పంపిణీ చేసి సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి జెండాను ఎగురవేశారు. మండల కన్వీనర్ పి.వి.సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ కడప పార్లమెంటరీ కన్వీనర్ చంద్రశేఖరరెడ్డి, సర్పంచ్ అంకాలమ్మ, ఉపసర్పంచ్ వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ కడప పార్లమెంటరీ కన్వీనర్లు జగన్‌మోహన్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ నాగేంద్రనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



వేముల : భూమయ్యగారిపల్లెలో జెండాను ఆవిష్కరిస్తున్న మండల ఇన్‌చార్జి, ఎంపీపీ, జెడ్పీటీసీలు



పులివెందుల : పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు



తొండూరులో జెండాను ఆవిష్కరిస్తున్న శాప్ రాష్ట్ర డైరెక్టర్, మండల అధ్యక్షుడు రవీంద్రారెడ్డి



చక్రాయపేట : సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్ కొండారెడ్డి



లింగాలలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, మండల కన్వీనర్, తదితరులు



సింహాద్రిపురం : సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్ఆర్‌సీపీ నాయకులు



వేంపల్లె : సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, ఎంపీపీ

ప్రారంభమైన కార్తీక మహోత్సవాలు

వేంపల్లె : స్థానిక బలిజ సంఘం వీధిలో వెలసిన శ్రీగౌరిదేవి ఆలయంలో గురువారం నుంచి 17వ కార్తీక మహోత్సవాలు ప్రారంభమైనట్లు బలిజ సంఘం అధ్యక్షుడు నంబూరు కుళ్లాయప్ప, కటిక చంద్రశేఖర్‌లు తెలిపారు. ఈ ఉత్సవాలు ఈనెల 23వ తేదీనుంచి 27వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఈ ఉత్సవాలలో భాగంగా ప్రతి రోజు గౌరిదేవి వివిధ దేవతా అవతారంలో దర్శనమిస్తారనానరు. ఆలయంలో అర్చకులు ఎస్.ప్రసాద్ శర్మ నేతృత్వంలో గురువారం ఉదయం గౌరిదేవికి భక్తిశ్రద్ధలతో అభిషేకం నిర్వహించామన్నారు. కలశస్థాపన, గణపతిపూజ, పుణ్యాహవాచనం, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాదాల వినియోగం జరిగిందన్నారు. రాత్రి గౌరిదేవి శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారని తెలిపారు. ఉత్సవాలలో ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బలిజ సంఘం ఉపాధ్యక్షుడు ఎద్దుల రామచంద్ర, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకారంలో గౌరిదేవి అమ్మవారు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించిన అకడమిక్ అండ్ ఆడిట్ కమిటీ

వేంపల్లె : ఉన్నత విద్యాశాఖ నియమించిన అకడమిక్ అండ్ ఆడిట్ కమిటీ సభ్యుల కమిటీ గురువారం స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు. కమిటీ సభ్యులు డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ కిరణ్‌కుమార్‌లు కళాశాలను సందర్శించి వివిధ విభాగాల రికార్డులను పరిశీలించారు. నేడు ఉన్నత విద్యా రంగంలో ప్రామాణికమైన న్యాక్‌లో ఉత్తమ గ్రేడ్‌ను సాధించడానికి వివిధ అర్హతలు గల 7-కేటగిరీలను పరిశీలించి అనేక సూచనలు చేశారు. కళాశాలలో కార్యనిర్వాహణ, బోధన పద్ధతులు మరియు వివిధ శాఖల పనితీరు బాగుందని పరిశీలకులు కొనియాడారు. పరిశోధన రంగం, విద్యార్థులకు ఉన్నత విద్యనభ్యసించే అవకాశాలను మరియు సంఘాలను ఏర్పాటు చేసినట్లయితే కళాశాలకు మరింత మంచి గ్రేడ్ రావడానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ సతీష్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అకడమిక్ అండ్ ఆడిట్ కమిటీ సభ్యురాలు కృష్ణవేణి

అభివృద్ధి పనుల పరిశీలన

సింహాద్రిపురం : స్థానిక ప్రభుత్వ కార్యాలయాలు, డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్లు, పార్కులతోపాటు మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో దాదాపు రూ.200 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ణీత సమయంలో అభివృద్ధి పనులన్ని పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. అలాగే డిసెంబర్ నెలలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో హెలీకాప్టర్ ల్యాండ్ అవడానికి అనువైన ప్రదేశాలను కూడా వారు పరిశీలించారు.



ప్రభుత్వ కార్యాలయ పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి

ఓబులేసుకు పోలీసు సేవా పతకం



ముద్దనూరు : స్థానిక అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న పి.ఓబులేసు పోలీసు సేవా పతకానికి ఎంపిక య్యాడు. నవంబరు 1న, ఆంధ్రప్రదేశ్ అవతరణ సందర్భంగా ఈ సేవా పతకానికి ఓబులేసు ఎంపికైనట్లు జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ నుంచి ఆదేశాలు వచ్చినట్లు సీఐ నరేష్‌బాబు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ ఓబులేసు విధినిర్వహణలో సత్ప్రవర్తనతో పాటు ఎటువంటి శాఖాపరమైన శిక్షలకు గురికాకుండా ఉద్యోగ విధులు నిర్వహించడం వల్ల పోలీసు శాఖ ఈ సేవాపతకాన్ని అందజేయనున్నట్లు సీఐ తెలిపారు. సేవాపతకానికి ఎంపికైన ఓబులేసును గురువారం సీఐ నరేష్‌బాబు, ఎస్ఐ చంద్రమోహన్, సిబ్బంది అభినందించారు.

ఎంపీడీఓగా సాయినాయక్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన సాయినాయక్

వీరపునాయునిపల్లె : వీఎన్‌పల్లె మండల అభివృద్ధి అధికారిగా సాయి నాయక్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఎంపీడీఓ పోస్టు కాళీగా ఉండటంతో ఏడాగా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం సాయి నాయక్‌ను రెగ్యులర్ అధికారిగా నియమించారు.

బీజేపీ పులివెందుల అసెంబ్లీ కన్వీనర్‌గా మహేశ్వరరెడ్డి

పులివెందుల టౌన్ : బీజేపీ పులివెందుల అసెంబ్లీ కన్వీనర్‌గా మహేశ్వరరెడ్డిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నియమించారు. పులివెందుల నియోజకవర్గం లింగాల గ్రామానికి చెందిన తేరా మహేశ్వరరెడ్డి గతంలో బీజేపీ లింగాల మండల అధ్యక్షులుగా, కడప జిల్లా కిసాన్ మోర్చా జిలా అధ్యక్షుడిగా పనిచేశారు.

క్షయ వ్యాధి నివారణ మనందరి బాధ్యత

పులివెందుల రూరల్ : క్షయ వ్యాధి నివారణ మనందరి బాధ్యత అని ఆర్‌ఎంఓ డాక్టర్ ముక్తియార్ తెలిపారు. జాతీయ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి ముక్త్ భారత్ అభియాన్ ఆధ్వర్యంలో పవర్ గ్రిడ్ సంస్థ చీఫ్ మేనేజర్ వెంకన్న సౌజన్యంతో పులివెందుల ప్రాంత క్షయ వ్యాధి గ్రస్తులకు గురువారం పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్‌ఎంఓ, తదితర వైద్యులు 150 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎంఓ మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు రావడం, సాయంత్రం సమయంలో చలితో కూడిన జ్వరం వస్తుండటం, ఆకలి లేకపోవడం, అనుకోకుండా బరువు తగ్గడం, దగ్గు సమయంలో ఛాతిలో నొప్పి రావడం లాంటి లక్షణాలు ఉన్నట్లయితే వెంటనే దగ్గరలోని ప్రభుత్వాసుపత్రిలోని వైద్యులను సంప్రదించాలన్నారు. అటువంటి వారికి వైద్యులు పరీక్షలు చేసి అనంతరం క్షయ వ్యాధిగా గుర్తించినట్లయితే ప్రతి ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా మందులు ఇస్తారన్నారు. కార్యక్రమంలో స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, క్షయ వ్యాధి సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.



కుష్టు వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందిస్తున్న ఆర్‌ఎంఓ డాక్టర్ ముక్తియార్, తదితరులు

ఘనంగా సత్యసాయిబాబా జయంతి

వేంపల్లె : స్థానిక కడప రోడ్డులోని శ్రీసత్యసాయిబాబా ఆలయంలో వేంపల్లె శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యలలో శ్రీసత్యసాయిబా 98వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే పట్టణ పురవీధులలో సేవా సమితి సభ్యులు సత్యసాయిబాబా నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం స్థానిక షిర్డిసాయి మందిరంలో సత్యసాయి బాబాకు అభిషేకం, భజన, గాయత్రి జపం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబరిచిన ప్రైవేట్ పాఠశాలలు ఉషాకిరణ్, తేజ, చైతన్య, వివేకానంద, శ్లోకా, తలిశెట్టి సుబ్రమణ్యం, తలిశెట్టి శేషమ్మ జెడ్పీ పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి, జిల్లాస్థాయి ప్రశంసా పత్రాలతోపాటు సత్యసాయిబాబా మెమెంటో, జీవిత చరిత్ర పుస్తకాలు, బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యకరమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కుంచా సాయినాథ్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి బహుమతిని అందిస్తున్న సత్యసాయి సేవా సమతి సభ్యురాలు

పీటీడీ వైఎస్ఆర్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌కు గుర్తింపు

కడప కోటిరెడ్డి సర్కిల్: రాష్ట్ర పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ వైఎస్ఆర్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌కు గుర్తింపు హోదాను ఇవ్వడం అభినందనీయమని వైఎస్ఆర్ ఎంపాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్. బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. గురువారం ఆయన సాక్షితో మాట్లాడుతూ తమ యూనియన్‌కు గుర్తింపు ఇచ్చినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావుకు, వైఎస్ఆర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ మల్లిఖార్జున రెడ్డికి, కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డికి, రాష్ట్ర డిప్యూటీ సీఎం అంజాద్ బాషాకు, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లి చంద్రయ్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

రేపు శని త్రయోదశి

కడప కల్చరల్ : కడప నగరం చిన్నచౌకు రామకృష్ణ నగర్‌లోని శ్రీ శనీశ్వరస్వామి ఆలయంలో శనివారం శనిత్రయోదశి సందర్భంగా విశేష పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు శ్రీధర్‌శర్మ తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 5.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు స్వామికి తైలాభిషేకం నిర్వహిస్తామని, భక్తులు ఎవరైనా కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు.